ఖబ్రస్థాన్ భూమిని సర్వే చేయండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణికొండ: మైనార్టీలకు అవసరమైన ఖబ్రస్థాన్‌కు కేటాయించిన భూమిని వెంటనే సర్వే చేసి హద్దులు నిర్ణయించి అప్పగించాలని మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు తహసీల్దార్‌ను కోరారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ సర్వే నెంబర్ 44లో జిల్లా కలెక్టర్ ఐదు ఎకరాల భూమిని గతంలో ఖబ్రస్థాన్‌కు కేటాయించారు. ఉత్తర్వులు ఇచ్చి నెలలు గడుస్తున్నా సర్వే చేయటం, హద్దులు నిర్ణయించటం, అప్పగించే పనులను చేపట్టలేదు. శనివారం గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సర్వే పనిని వేగవంతం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ యాక్షన్ కమిటీ చైర్మన్ జాఫర్ అహ్మద్, అధ్యక్షుడు సయ్యద్ ఆమెర్, కార్యదర్శి అక్బర్ ఆలీ, బీఆర్ఎస్ నాయకులు బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఎ. లక్ష్మణ్‌రావు, షేక్‌ఆరీఫ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మైలార్‌దేవ్‌పల్లి: పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్.ఐ సాజిద్ అలీ వివరాల ప్రకారం..శుక్రవారం అర్ధరాత్రి శాస్త్రీపురం డివిజన్ పరిధిలోని సుభాన్‌కాలనీలో నివసిస్తున్న ఇఫ్తికర్, అహ్మద్ ఇంటిలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు జరిపి మహమ్మద్ హసన్(47), మహమ్మద్ రియాజ్(36),మహమ్మద్ అంజద్ (39)అజీజ్ మిర్‌ఖాన్ (48)మహమ్మద్ కై జర్ (42), మహమ్మద్ మహమూద్ (32)సమీయుల్లా(20)ను అదుపులోకి తీసుకుని 64,995 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పర్యవేక్షణ కరువై..
దుర్గంధానికి నెలవై


శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న పార్కు ప్రహరీ

అత్తాపూర్: అధికారుల పర్యవేక్షణ లేక పార్కుల పరిసరాలు చెత్తచెదారాలు, వ్యర్థాలతో నిండిపోతున్నాయి. నిర్వహణ లోపాన్ని సవరించాలని పలుమార్లు అధికారులను కోరిన ఏ ఒక్కరూ స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన పార్కు, ఆ పరిసర ప్రాంతాలు మురికి కూపంగా మారాయి. పార్కు ఆలనా పాలన చూసే వారు లేక నిరుపయోగంగా మారింది. చెత్తా చెదారాలకు డంపింగ్ కేంద్రంగా మారిపోయి ఈ దారి గుండా ప్రయాణించే బాటసారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

క్రిమి కీటకాలకు ఆవాసంగా..

పేరుకుపోతున్న వ్యర్థాల్లో మురుగునీరు చేరడంతో క్రిమి కీటకాలు వృద్ధి చెందుతూ దుర్వాసన వస్తుందని, స్థానికులు ఇష్టం వచ్చినట్లు చెత్తా చెదారాలను పారవేయడంతో మూగజీవాలు వ్యర్థాలను తింటూ అనారోగ్యం బారిన పడుతున్నాయి. ఈ మేరకు సంబంధిత అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించిన ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు.
పార్కుల అభివృద్ధి కోసం నిధులు ఖర్చు చేయకపోవడంతోనే పార్కు శిథిలావస్థకు చేరుకుంది. పార్కుకు ఏర్పాటు చేసుకున్న ప్రధాన గేటు సమీపంలో గోడ శిథిలావస్థకు చేరి ఎప్పుడూ కులుతుందో తెలియని పరిస్థితి దాపురించింది. ఉదయం, సాయంత్రం విద్యార్థులు, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్, యువకులు, పిల్లలకు ఆడుకునేందుకు గ్రౌండ్‌ను ఏర్పాటు చేసి ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


పార్కుకు వెళ్లే రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు

అభివృద్ధిపై సమావేశం ఏర్పాటు చేయండి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు శనివారం కమిషనర్ శరత్‌చంద్రను కలిసి అభివృద్ధి పనులపై సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. సమావేశంలో సమస్యలపై చర్చించి అందుకు అనుగుణంగా నిధులను మంజూరు చేసేలా చూడాలన్నారు.

కోట మైసమ్మ ఆలయంలో పూజలు

రాజేంద్రనగర్: బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. దేవి నవరాత్రులు విజయవంతంగా ముగియడంతో ఈ పూజ కార్యక్రమాలను నిర్వహించినట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


అల్డాస్ జానయ్య

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కొత్త ఉపకులపతి (వీసీ)గా అల్డాస్ జానయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి వీసీగా ఉన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం విశ్వవిద్యాలయం అధికారులతో సమావేశమైన రఘునందన్‌రావు మాట్లాడుతూ... ఇన్నాళ్లు ఇన్‌చార్జి ఉపకులపతిగా విశ్వవిద్యాలయం పనితీరును మెరుగుపర్చటానికి సాధ్యమైనంత కృషి చేశానన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ రంగం అత్యంత ప్రాధాన్య రంగమని ప్రభుత్వం రైతాంగానికి, వ్యవసాయ రంగ సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నదని విశ్వవిద్యాలయం ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. జానయ్య మాట్లాడుతూ... జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లోనూ ఇప్పటికే 15 హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించానని తెలిపారు. తాను ప్రతి హోదాను అధికారంలా కాకుండా బాధ్యతగా భావిస్తానని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అల్డాస్ జానయ్యను పలు విద్యార్థి సంఘాల నాయకులు, వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాటం శ్రీధర్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

భజనలో రఘువీర భక్త సమాజం సభ్యులు


పూజల్లో పాల్గొన్న రఘువీర భక్త సమాజం సభ్యులు

అత్తాపూర్: భద్రాద్రి శ్రీరాముల వారి సన్నిధిలో శనివారం జరిగిన భజన కార్యక్రమానికి అత్తాపూర్ రఘువీర భక్త సమాజం ఆధ్వర్యంలో భజన బృందం హాజరయ్యారు. 30 మందితో కూడిన బృందం లోక కల్యాణం, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాలకృష్ణ, దయానంద్‌గౌడ్, నారాయణరెడ్డి, హరిచంద్ర, వేణుగౌడ్, ఇంద్రసేనారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీశైలం, భాస్కర్‌గౌడ్, శ్రీపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సంగీత

అత్తాపూర్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్ పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని రినోవా ఆస్పత్రి ఆధ్వర్యంలో నలందానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు రినోవా ఆస్పత్రి నిర్వాహకులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, గౌతమి, వినయ్, మనిషా, విద్య కాలనీ అధ్యక్షుడు రాజ్‌గోపాల్, కమిటీ సభ్యులు రాజకుమార్, నారాయణ రెడ్డి, శివప్రసాద్, రామారావు పాల్గొన్నారు

సీబీఐటీకి ఐఎస్ఓ పొడిగింపు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల గ్రీన్ ఇనిషియేటీవ్స్, ఎనర్జీ సేవింగ్ ప్రాక్టీసెస్‌లో చేసిన విశేష కృషితో ప్రతిష్టాత్మక ఐఎస్ఓ గుర్తింపును మరోమారు పొడిగించి శనివారం ధ్రువపత్రాన్ని కళాశాలలో అందజేశారు. విద్యార్థులు, సిబ్బందికి మధ్య పర్యావరణ అవగాహనను పెంపొందించటంలో సీబీఐటీ చేసిన కృషికి ఈ గుర్తింపు లభించిందని హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య అన్నారు. సీబీఐటీ కళాశాల పర్యావరణ సంరక్షణ, ఎనర్జీ సేవింగ్ కార్యక్రమాల్లో దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. వారి ఆధునిక పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టిన కృషిని గుర్తించి ఐఎస్ఓ గుర్తింపును పొడిగించామన్నారు. ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. ఐఎస్ఓ గుర్తింపు పొడిగింపు కళాశాలకు మరో మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌వీ కోటేశ్వర్‌రావు, అధ్యాపకులు డాక్టర్ బి. సురేష్‌కుమార్, ప్రొఫెసర్ కె. జగన్నాథరావు, డాక్టర్ ఎస్ఎల్ఎస్ రెడ్డి, డాక్టర్ జి. విజయలక్ష్మి, డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.


ధ్రువపత్రాలను అందజేస్తున్న శివయ్య


బహుమతి అందుకుంటున్న రాయదుర్గం జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సాలీహతాజీన్

జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు

రాయదుర్గం: రామన్నగూడెంలోని వశిష్ట మోడల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలను శనివారం నిర్వహించారు. డ్యాన్స్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, ఓకల్ మ్యూజిక్, డ్రామా, స్టోరీ టెల్లింగ్, విజువల్ ఆర్ట్స్ వంటి విభాగాల్లో మండలస్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయదుర్గం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్‌కే తాజ్‌బాబు మాట్లాడుతూ రాయదుర్గం జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థి సాలీహతాజీన్ డ్రామా విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. అదేవిధంగా విజువల్ ఆర్ట్స్ విభాగం జిల్లాస్థాయి పోటీల్లో అదే పాఠశాలకు చెందిన విక్రమ్ ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని ఆయన, ఉపాధ్యాయులు అభినందించారు.


బహుమతి అందుకుంటున్న విద్యార్థిని విక్రమ్

పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శనివారం టీజీపీఏ, బ్రాడ్ వే హోటల్ రోడ్డుపై జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్మికులు రోజూ ఉదయం మొదట ప్రధాన రహదారులు ఆ తర్వాత బస్తీలు, కాలనీల్లోని రోడ్లను శుభ్రం చేయాలన్నారు.

దుండగుడిని శిక్షించాలి


ఆందోళన చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

శంషాబాద్: ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. దుండగుడిపై తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్, కౌన్సిలర్ మేకల వెంకటేష్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి..

రాజేంద్రనగర్: సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న భక్తులపై లాఠీ చార్జీకు ఆదేశించిన పోలీసు అధికారులతో పాటు లాఠీచార్జీ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బజరంగ్ దళ్ నాయకుడు పవన్ సాయి డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ కులగణన శాస్త్రీయ పద్ధతిలో జరగాలి

నాంపల్లి: ఎస్సీ, ఎస్టీ కులగణన శాస్త్రీయ పద్ధతిలో జరగాలని, ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నె శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం సంక్షేమ భవన్‌లోని షెడ్యూల్డ్ కులాల డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి అమిత్ యాదవ్‌ను కలిసి 19 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వినతిపత్రాన్ని కుల గణన కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్టింగ్ జడ్జికి పంపాలని కోరారు. ఈ సందర్భంగా మన్నె శ్రీధర్‌రావు మాట్లాడుతూ..కుల గణనలో మాల జాతి, అందులోని ఉప కులాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ నేతలు బల్వంతరావు, గోకుల కల్యాణ్, ఎస్.ప్రవీణ్ కుమార్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 'క్లీనప్ డ్రైవ్'



హెచ్‌సీయూలో చెత్త తరలిస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'క్లీనప్‌డ్రైవ్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ కృష్ణయ్య ఆధ్వర్యంలో వలంటీర్లు క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఆ విభాగం డీన్ ప్రకాశ్ గౌతం, ఫ్యాకల్టీ, విద్యార్థులు కూడా వలంటీర్లతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలు, ఎండు ఆకులు,కలుపు మొక్కలు చెట్ల కొమ్మలను తొలగించారు. అలాగే పరిసరాల్లో ఎండిన దుంగలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంప్‌యార్డ్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్‌సీయూను క్లీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఏడాది పొడవునా శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో ఎన్ఎస్ఎస్, శానిటేషన్, హార్టికల్చర్ విభాగాలు సమష్టిగా చేసే కార్యక్రమంలో విద్యార్థులు కూడా భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీంసింగ్, వలంటీర్లు, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రూపురేఖలు మార్చిన ఎన్ఎస్ఎస్ యూనిట్

హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రాంగణంలో క్లీనప్ డ్రైవ్ తర్వాత ఆ ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. ఇంతకుముందు ఉన్న పెరిగిన గడ్డి, చిన్నచిన్న పిచ్చి మొక్కలు తొలగించడంతో అక్కడి పరిసరాలు ప్రస్తుతం శుభ్రంగా కనిపిస్తున్నాయి.


కార్యక్రమం అనంతరం పరిశుభ్రంగా కనిపిస్తున్న పరిసరాలు

విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

రాయదుర్గం: విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకుంటే అవకాశాలు మెండుగా ఉంటాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వై. జహంగీర్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలోని గోపన్‌పల్లిలోని సెయింట్ జేవీయర్స్ పీజీ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు 'ఎంబీఏ ఫ్రెషర్స్-నెక్స్ట్-జెన్-మేనేజర్స్' అనే అంశంపై శనివారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో టెక్నాలజీలో అనేక మార్పులు వస్తాయని, అందులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వచ్చే ఉపయోగాలు, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా ఆలోచించాలన్నారు. చదువు, ఇతర పనులపై ఒక ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగాలని సూచించారు. హైదరాబాద్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ కోశాధికారి కీర్తి గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో కేవలం చదువుంటే సరిపోదని, అవసరానికి అనుగుణంగా నైపుణ్యాలు కూడా నేర్చుకోవాలని, సర్టిఫికెట్ కోర్సులపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ రవి మాట్లాడుతూ యేటా మొదటి సంవత్సరం ఎంబీఏ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి క్రమశిక్షణ, కష్టపడేతత్వాన్ని విద్యార్థులు అలవర్చుకునేలా, వారిలో నైపుణ్యాలు మెరుగుపడేలా చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సుధీర్, ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ డీ శ్రీలత, కే శ్వేత, కే భారతి, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులపై పట్టింపేదీ..?

- పగుళ్లు ఏర్పడి మూణ్నాళ్ల ముచ్చటగానే..
- పట్టించుకోని ఇంజినీరింగ్ శాఖ అధికారులు

సీసీ రోడ్డు నిర్మాణాలకు తూతూ..మంత్రంగా క్యూరింగ్


దీప్తిశ్రీనగర్ కాలనీలో క్యూరింగ్‌కు నోచుకోని సీసీ రోడ్డు

మియాపూర్: ప్రజా అవసరాల దృష్ట్యా లక్షలాది రూపాయాలతో పలుచోట్ల నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలు నాసిరకంగా ఉంటున్నాయి. పనులు ప్రారంభం మొదలు అందుబాటులోకి వచ్చేవరకు పర్యవేక్షించాల్సిన జీహెచ్ఎంసీ క్వాలిటీ కంట్రోల్ అధికారుల ఉదాసీనతా, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని ఫలితంగా పనుల్లో నాణ్యత కొరవడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు తూతూ.. మంత్రంగా క్యూరింగ్ చేసి వదిలేయడంతో పగుళ్లు ఏర్పడి మూన్నాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్ శాఖలో కొంతమంది అధికారులు కాసుల కక్కుర్తితో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ఎంపీనగర్ నుంచి శాంతినగర్ వెళ్లే సీసీ రోడ్డుపై పగుళ్లు

అంతంతమాత్రంగానే క్యూరింగ్..

సీసీ రోడ్డు పనులు చేపట్టి ఉదయం, సాయంత్రం వేళల్లో రోజుకు రెండుసార్లు క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు కాంట్రాక్టర్లు పైపైనే క్యూరింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేగాకుండా రోడ్డు నిర్మాణం సమయంలో నిర్ణీతదూరంలో మ్యాగ్నటిక్ రబ్బర్ తాళ్లను ఏర్పాటు చేసి పనులు చేపట్టాల్సి ఉంటుంది. కానీ అవేమీ వేయకుండానే రోడ్డును వేస్తుండడంతో త్వరగానే పగుళ్లు ఏర్పడుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.


దీప్తిశ్రీనగర్ కాలనీలో గుంతలమయంగా రోడ్డు

- మియాపూర్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసిన సీసీ, బీటీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కొద్ది రోజులకే పగుళ్లుపడి గుంతలు ఏర్పడుతున్నాయి.
- నాణ్యతా ప్రమాణాలు చూడాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతోనే రోడ్ల పరిస్థితి ఇలా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- అధికారులు రోడ్ల పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు సరిగా లేకుంటే నోటీసులు ఇచ్చి బిల్లులు ఆపే అధికారం ఉన్న ఆచరణలో లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ, సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.